*హారిక వారపత్రిక (12-10-90)*

# రాధిక

రాజా!

ఇంత చనువుగా పిలుస్తున్నానేమిటని ఆశ్చర్యపోతున్నావుకదూ! నమ్మగలవో లేదో ఇప్పుడు నిన్ను మించిన ఆత్మీయుడు నాకీ లోకంలో ఎవ్వరూ లేరు. అందుకే, నా హృదయంలో సుడులు తిరిగే వేదనని నీతో చెప్పుకోవాలని ఆరాటపడుతున్నా. స్వతంత్రించి నిన్ను రాజా అని పిలుచుకుంటున్నా!

తనకంటే రెండేళ్ళు పెద్దది. పెళ్ళయిన ఆడది. ఇలా రాస్తుంటే ఎలాంటి వాడికయినా కంగారు పుడుతుంది. అందులో నీలాంటి అమాయకుడికి భయమూ వేస్తుంది.

అంతా తెలిసే ఇలా రాస్తున్నా. నువ్విది చదివి నన్నర్థం చేసుకోగలవన్న ఆశతోనే ఇది రాస్తున్నా. చదువు రాజా! పూర్తిగా చదువు. కంగారుపడి సగంలో దీన్ని చింపేయకు. పూర్తిగా చదివాక నీకేం చేయాలనిపిస్తే అది చేయి. నీకేది భావ్యమనిపిస్తే అది చేయి.

భర్త పెద్ద వ్యాపారస్తుడు. కాళ్ళా వేళ్ళా డబ్బు. రెండంతస్తుల మేడ. ఇంటినిండా సౌకర్యాలు. కావల్సినన్ని సౌందర్య సాధనాలు. నాలాంటి ఆడదానికి ఎటువంటి లోటూ ఉండదని అంతా అనుకుంటారు. అందరిలాగే నువ్వు అనుకొని వుండచ్చు. అది లోక సహజం. కాని, నా జీవితంలోకి తొంగి చూడగలిగితే నాలో రగిలే మంటల్ని గుర్తించగలిగితే నిజం ఎంత చేదుగా ఉంటుందో నీకు తెలుస్తుంది.

భర్త ఇంట మొదటిసారి అడుగుపెట్టే కొత్త పెళ్ళి కూతురి కమ్మని కోరికలు ఎలా ఉంటాయి? నీకు పెళ్ళి కాలేదు. మగవాడివి. నీ వూహకి ఆడపిల్ల అనుభూతులు అందక పోవచ్చు. కానీ, బాగా చదువుకున్న వాడివి. ప్రబంధాల్లోని, కావ్యాల్లోని పద్యాలు చదివి మా కరుణకి చక్కగా అర్థంచెప్పగల సమర్థుడివి. అటువంటి నీకు ఊహించటం కష్టం మాత్రం కాదు!

తనలో ఒక భాగంగా ఆదరిస్తాడని, అక్కున చేర్చుకొని ప్రణయరాగం ఆలపిస్తాడని.... తన పుట్టింటి వాళ్ళని ఇట్టే మరిపించి కొత్త జీవితం నిండా మాధుర్యం నింపుతాడని ఎన్నెన్నో తియ్యని వూహలు పోతూ భర్త యింట అడుగుపెడుతుంది కొత్త పెళ్ళి కూతురు. నేనూ ఆరేళ్ళనాడు అలాంటి కలలు కంటూ ఈ యింట్లో అడుగు పెట్టాను. కాని, నా కలలన్నీ కల్లలవుతాయని పెళ్ళికి ముందుకు ఊహించలేకపోయాను!

గది తలుపులు తెరచుకొని, లోపలికి వచ్చిన నా భర్త.... ఒక కన్నెపిల్ల తియ్యని కోర్కెల్ని తీరుస్తూ జీవిత మాధుర్యాన్ని తొలిసారిగా రుచి చూపించాలని వచ్చిన రసికుడిలా లోపలికి రాలేదు. ఈ రాత్రే కాదు - ఇకముందు నీ జీవితమంతా ఇలాగే తెల్లవారుతుంది. తెల్సుకోవే నిర్భాగ్యురాలా - అని చెపుతున్నట్టు తప్పతాగి తూలి పడుతూ లోపలకి వచ్చాడు. తొలి రాత్రి భర్త చిలిపిగా చల్లే పన్నీటి చిలకరింపుకి గుండె జల్లుమనే మధురానుభవం కోసం ఎదురుచూసిన నాకు నా భర్త షాక్ తినిపించాడు. క్రిందపడి పోతున్నవాడిని పట్టుకొని లేవదీయబోతే నామీద కక్కిపోసి, నన్ను నిలువునా దుర్గంధంతో నింపి పోసాడు.

'ఏమిటీ విపరీతం? ఎందుకలా చేసారు?' అని నేను నెత్తి మొత్తుకొని ఏడ్చిందంతా అరణ్యరోదనం అయిపోయింది. ఆయన నా గోడు వినిపించుకొనే స్పృహలో లేరు. నా తొలిరాత్రి కాళరాత్రిగా గడిచింది.

ఆ రాత్రే కాదు. ఈ ఆరేళ్ళ వైవాహిక జీవితంలో అంతకన్న దౌర్భాగ్యపు రాత్రులు నాకు చాలానే గడిచాయి. ఆయనకిదొక్క చెడు అలవాటు అయితే నేనింత బాధపడవల్సిన అవసరం లేకపోయేదేమో!.....కాని, నాకా మాత్రం అదృష్టం కూడా లేదు.

ఆయన పేకాట ఆడతారు. ఏనాడూ పగటిపూట ఇంట్లో ఉండరు. ఓనాడు ఓర్చుకోలేక అడిగితే పేకాట ఆడటం కూడ తన బిజినెస్‌లో ఒక భాగమేనన్నారు. ఆ తర్వాత ముచ్చటయిన వారి మూడో వ్యసనం గురించి కూడా నాకు తెల్సి వచ్చింది. బయట కోరికలు తీరుతున్న మగవాడికి ఇక భార్య అవసరమేముంది? నిలదీసి అడిగితే అదికూడా తన బిజినెస్‌లో ఒక

భాగం అని అనగల సమర్థుడు నా పతిదేవుడు!

జీవితంలో అనుభవించవల్సినవి ఎన్నో ఉన్నాయి. అవి కొన్నయినా తీరగలవన్న ఆశతోనే నాకీ గొప్పింటి సంబంధం చేసారు మా వాళ్ళు. కానీ, నాకిప్పుడు మిగిలిందేమిటి? భర్త ఒక పూట ఇంట్లో వుండి నేను వండింది ఆయన తింటే అదే ఒక పండగ అని తృప్తి పడవల్సి వస్తోంది. తాగి స్పృహలో లేకపోయినా నా పక్కనే మంచం మీద పడుకుంటే అదే సుఖభోగమని సంతృప్తి పడవల్సి వస్తోంది.

ఆయన కెంతసేపూ తన సంపాదన, తన సుఖం.... తన కోరికలు తీరటం అంతే తప్ప కట్టుకున్న ఇల్లాలికి్కాడ కనీసపు కోరికలు కొన్ని ఉంటాయని, అవి డబ్బుతో తీరవని ఆయనకు తోచదు. తిండి, బట్ట - వీటితో జీవితం తీరిపోదని.... మాటా మన్నన లేకుండా ఆడది బ్రతకలేదని ఆయనకు అనిపించదు!

ఒక్కోసారి ఈ బాధ భరించలేక పోయేదాన్ని. 'నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?' అని ఆయన్ని నోరువిప్పి అడిగినందుకు ఆయన నన్ను దగ్గరికి తీసుకున్నది - మురిపించటానికి కాదు, కంటి తడిని తుడవటానిక్కాదు. మూతి పగిలి రక్తం చిందేలా లెంపలు వాయగొట్టటానికి. వెన్ను వంచి ఒళ్ళు హూనమయ్యేలా చితక కొట్టడానికి. 'కావాలంటే ఇంట్లో వుండు. లేకపోతే నీకు దిక్కున్న చోటికి పోవే....' అని ఎవర్కీ చెప్పుకోలేని తిట్లు తిట్టారు.

ఏదో ఒకనాటికి ఆయన మనస్సు మారుతుందన్న ఆశ నాకు పూర్తిగా పోయింది. నిర్వీర్యంగా ఈ జీవితాన్ని గడపటం నాకు కష్టమయిపోయింది. కన్నవాళ్ళతో ఈ బాధ చెప్పుకోలేను. వాళ్ళ గుండెల్లో చిచ్చుపెట్టలేను. వాళ్ళకున్న బరువు బాధ్యతలు వాళ్ళకింకా ఉన్నాయి. ఆయన్ని అదుపులో పెట్టటానికి ఇంట్లో పెద్ద దిక్కు లేదు. ఆరళ్ళు పెట్టేదే అయినా ఇంట్లో నాకూ ఒక అత్తగారుంటే ఎంత బాగుండును - అని నేను అనుకున్నానంటే నా దౌర్భాగ్య స్థితిని నువ్వు ఊహించవచ్చు!

నా బాధల్ని తీర్చే వాళ్ళెవరూ ఈ లోకంలో లేరు. వ్యర్థమయిన ఈ బ్రతుకు బ్రతక్క పోతేనేం? ఒక రాత్రి చచ్చిపోదామని నిశ్చయించుకున్నాను. సీలింగ్ ఫేన్‌కి చీర ముడివేసి ఉరి పోసుకోబోయాను. రెండు నిముషాలు పోతే ఇంక ఈ బంధాలతో తెగ తెంపులు అయిపోయి వుండేది. కాని, ఎలా కనిపెట్టిందో ఎప్పుడు వచ్చిందో నా కాళ్ళను వాటేసుకుంది కరుణ. ఆ పిల్ల నా కాళ్ళకడ్డం పడి వుండకపోతే నేనానాడే చచ్చిపోయి వుండేదాన్ని.

'అమ్మా!' అని ఒక పసిబిడ్డచేత పిలిపించుకోలేకపోతున్న నిర్భాగ్యురాల్ని. 'వదినా!' అని ఆ పిల్ల పిలిస్తే అదే నా భాగ్యంగా భావించి తృప్తి పడి పోతున్నాను.

నా పెళ్ళికి కరుణకి పదేళ్ళు. ఇంక రెండు మూడేళ్ళు పోతే కరుణకి పెళ్ళీడు వస్తుంది. అంతవరకూ బ్రతికి వుండాలి కనుక ఎంతో కొంత తినాలి. 'ఏమిటి వదినా!' ఎందుకిలా చప్పిడి మెతుకులు తింటావు?' అని వాపోతుంది కరుణ. ఏమని చెప్పను? ఈ శరీరాన్ని ఎందుకిలా శుష్కింపజేసుకుంటున్నానని చెప్పను? నిజం చెప్పి ఆ పసిదాన్ని ఎలా బాధపెట్ట

గలను?

'లావెక్కి పోతున్నాను చూసావా?' అని నవ్వి మాట దాటవేస్తూంటానోసారి. శుక్రవారం ఉపవాసం అంటాను మరోసారి. అమావాస్య అంటాను ఇంకోసారి. ఆ పిల్లని మభ్యపెట్టి ఇంతకాలం ఎలాగో బ్రతుకు వెళ్ళదీసుకుంటూ వచ్చాను.

ఎడారిలాంటి ఈ జీవితం ఇంకిలాగే కడతేరిపోతుందనుకున్నాను. కాని, ఈ మోడు వారిన బ్రతుకుని మళ్ళీ చిగిరింపజేయటానికా అన్నట్టు నువ్వు వచ్చావు!

'ఎక్కడా ఇల్లు దొరకటం లేదు. ఎవర్నడిగినా పెళ్ళయిన వాళ్ళకే ఇస్తామంటున్నారు. నేనీమధ్యనే ఉద్యోగంలో చేరాను. మీరు చాలా మంచివారిలా కనిపిస్తున్నారు. నాకేదయినా చిన్న గదినిప్పించండి. నేను మీకెటువంటి ఇబ్బందీ కలిగించను. మీకిష్టంలేని పని ఏదయినా చేస్తే వెంటనే వెళ్ళిపొమ్మనండి. వెళ్ళిపోతాను.....' నువ్వావేళ మా గుమ్మంలో నిలబడి ఈ మాటలు అంటూంటే నాకెంత ముచ్చటేసిందని! నీ కళ్ళల్లో ఎంత అమాయకత్వం! నీ గొంతులో ఎంత నిజాయితీ!

కొత్త మాస్టారు చాలా మంచివారు వదినా! మాకు తెలుగు పాఠాలు చాలా బాగా చెపుతారు. ఒక్కో పద్యానికి ఆయన అర్థం చెపుతూంటే ఎంత బావుంటుందనుకున్నావ్! అని కరుణ నీ గురించి నాకు ముందే చెప్పిందని నీకు తెలియదు. కరుణ సిఫారసు అవసరం లేకపోయింది. నేను నీకు మంచిదానిలా కనిపించినందుకు కాదు – నువ్వు నాకు మంచివాడిలా కనిపించినందుకే నిన్ను మేడమీద గదిలోకి వచ్చి చేరమన్నాను.

తల్చుకుంటే అప్పుడు నాకంత ధైర్యం ఎలా వచ్చిందో నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆయన అనుమతి లేకుండా ఈ జీవితంలో నేను తెగించి చేసిన మొదటి పని అదే!

అయినా ఆ తర్వాత నీకెటువంటి చేదు అనుభవమూ ఎదురు కాకూడదని మర్నాడు నీ గురించి ఆయనతో చెప్పాను. 'కరుణ టెన్త్‌లోకి వచ్చింది. ట్యూషన్‌కోసం ఎక్కడికో ఎదిగిన పిల్లను ఒంటరిగా పంపటం నాకిష్టం లేదు. ఆయన వాళ్ళ క్లాసు టీచరు. అందుకే ఆయన గది కావాలంటే వచ్చి వుండమన్నాను. మీరుండమంటే ఉంటారు. వద్దంటే వెళ్ళిపోతారు....' అన్నాను.

ఆయన ఏ కళనున్నారో వద్దనలేదు. ఆయన ఏమీ అనకపోవటమే ఒప్పుకోవటం క్రింద లెక్క. నా అదృష్టం బావుంది. నా మర్యాద దక్కింది.

నిజం రాజా! నువ్వు మా యింట్లో అడుగుపెట్టిన వేళావిశేషం అదేమో.... నా జీవితంలో చాలా చాలా మార్పులు వచ్చాయి.

ఆవేళ దొడ్లో తులసికోట దగ్గర పూజ చేసుకుంటూ కళ్ళు తిరిగి పడిపోయాను గుర్తుందా! కరుణ, నువ్వు నన్ను లేవనెత్తుకొని లోపలకి తీసుకు వెళ్ళినప్పుడు.... నిస్సత్తువతో నాకు కళ్ళు విడలేదు కాని మీ మాటలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి. డాక్టర్ని తీసుకువస్తానని నువ్వు వెళ్ళబోతూంటే 'వదిన ఇలా పడిపోవటం మొదటిసారి కాదు మాస్టారూ!' అంటూ

ఏవేవో చెప్పసాగింది కరుణ.

నా గురించి కరుణ బాధపడటమే కాదు - నిన్ను బాధపెట్టడం కూడా నాకు ఇష్టం లేదు. ఎక్కడలేని శక్తీ కూడదీసుకొని కరుణ నోరు మూసాను. నువ్వు సూక్ష్మగ్రాహివి. కరుణ చెప్పినవి నాలుగు మాటలే అయినా..... అంతకంటే ఎక్కువే గ్రహించావు. వంటింట్లోకి వెళ్ళి వేడి వేడి పాలు తీసుకువచ్చి స్వయంగా నాకిస్తూ నువ్వన్న మాటలు నా చెవుల్లో ఇప్పటికీ గింగురుమంటూనే వుంటాయి.

'పిల్లలు కావాలనుకుంటూ ఇలా ఉపవాసాలు చేసి చేసి మీరు శుష్కించి పోతే ప్రయోజనమేముంది? ఆరోగ్యమయిన పిల్లలు పుట్టాలంటే మీరు ఆరోగ్యంగా ఉండాలి. మీరిదివరకు ఆరోగ్యంగా అందంగా ఉండేవారట - కరుణ చెప్పింది. అప్పుడెలా వుండేవారో నాకు చూడాలని వుంది.... నీ మాటలు వినేసరికి నా గుండె చెఋవయింది..... నోరు జారి ఏదో అన్నాను. క్షమించండి. మీరు ఆరోగ్యంగా ఉండాలన్న ఆరాటంతో అన్న మాటలే కాని మరో దురుద్దేశంతో అన్నవి మాత్రం కావు అంటూ వెళ్ళిపోయావు. కాని, నేను ఏడ్చింది నీ మాటలు నొప్పించినందుకు కాదని నీకు తెలియదు. ఇన్నాళ్ళకి నా మనస్సు పులకించే రెండు మాటలు చెప్పే ఆత్మీయుడు దొరికాడన్న ఆనందంతో నాకా కన్నీళ్ళొచ్చాయని నీకు తెలియదు.

నేనందంగా ఆరోగ్యంగా వుంటే చూడాలని వుందన్నావు. బీటలు వారిన నా హృదయం మీద నీ మాటలు స్వాతిజల్లులా కురిసాయి. ఇంకిపోయిన నా అందచందాలు మళ్ళీ తోడి తెచ్చుకోవాలనిపించింది. ఇప్పుడు కరుణకోసమే కాదు. నాకోసం కూడా నేను బ్రతకాలన్న ఇచ్ఛ నాలో కలగసాగింది.

నువ్వు పద్యాలు చదివి కరుణకి అర్థం చెపుతూంటే ఆ కమనీయమయిన దృశ్యాలలోకి ఎగిరి వెడుతుంది నా మనసు. నీతో మాట్లాడ్డం ఒక అదృష్టం. నీతో కావ్యాలలోకి నడిచి వెళ్ళటం నా భాగ్యం.... ఆరేళ్ళల్లో కోల్పోయిన ఎన్నో మధురక్షణాల్ని ఈ నాల్గునెలల్లో నీ సమక్షంలో చూడగలిగాను.

ఆ మాటే నీతో స్వయంగా చెప్పాలన్న కోరిక నాకు కలిగింది. చెపుదామని ఎన్నోసార్లు నీ గదిదాకా వచ్చి తిరిగి వెళ్ళిపోయాను. ఏదో సంకోచం. మరేదో బిడియం నా కాళ్ళకు బంధాలు వేసాయి.

వారంనాడు సంధ్యవేళ నీ గదిలోకి నేను రాబోతుంటే మీ ఫ్రెండ్ సూరిబాబు నీతో అంటున్న మాటలు నాకు వినిపించాయి. '..... ఆమె వైపు ఎప్పుడయినా పరీక్షగా చూసావా? చూస్తే ఆమె కళ్ళు చెప్పే భాష నీ కర్థమయివుండేది. నీ మాటలు వింటూ నిన్నలాగే కన్నార్పకుండా చూస్తుంది. నువ్వెటు కదిలితే ఆమె కళ్ళు అటు తిరిగిపోతాయి. నేనక్కడే వున్నానన్న సంకోచం లేకుండా ఆమె అలా వొళ్ళు మరిచి పోతోందంటే ఆమె ఉద్దేశ్యమేమిటో గ్రహించలేవా?' అన్నాడు.

'ఛ! అసహ్యంగా మాట్లాడకు. ఆమెను చూస్తుంటే ఒక దేవత అనిపించదూ! ఒక పవిత్ర భావం కలగటం పోయి ఇంత నీచంగా ఎలా వూహించగలుగుతున్నావు? ఇలాంటి మాటలు నాతో చెప్పటానికయితే ఇకనుంచి నా గదికి రాకు.....' అంటూ నీ స్నేహితుడి మీద కోప్పడ్డావు.

నా మీద నీకున్నది పవిత్ర భావమా! నీకు నామీద పవిత్రభావం ఎందుక్కలిగింది? పవిత్రత అంటే? చిక్కి శల్యమయినప్పుడు చిన్న చూపు - ఆరోగ్యంగా అందంగా వుంటే అనుమానపు చూపులు.... అలాంటి భర్త నిరాదరణకి గురయి కృశించి నశించిపోయినా పవిత్ర అనే ముద్ర వుంటే ఆడదాని జన్మ చరితార్థం అయిపోయినట్టేనా? అన్నిటి మీద ఆశలు చచ్చి ప్రాణం తీసుకుందామనుకున్న దాన్ని ఆదరించి 'ఇంకొకరి కోసమే కాదు నీ కోసం కూడా నువ్వు బ్రతకాలి' అన్న ఆత్మీయుడ్ని మనస్సులో ఆరాధించటం అపవిత్రమయిపోతుందా?

వద్దు రాజా! నన్ను గుళ్ళో కూర్చోబెట్టి పూజలు చేయద్దు. దేవత, పవిత్రత అంటూ పెద్ద పెద్ద ముద్రలు వేయద్దు. నేనొక సామాన్యురాలిగానే బ్రతకాలనుకుంటున్నాను. లోకం దృష్టిలో ఎలాంటి దాన్నయినా నాకు కావల్సింది నన్ను ప్రేమించేవాళ్ళు. ఒక్క మంచి మాట. ఒక్క మంచి చూపు. పవిత్రమో - అపవిత్రమో! నాకు తెలియదు. ఆ ప్రేమ నాకు కావాలి. జీవితం మీద విరక్తి కలిగిన నాకు మళ్ళీ జీవించాలి - అన్న కోరిక కలిగేలా చేసిన వ్యక్తిని ప్రేమించకుండా ఎలా వుండగలను!

ఆయన వూళ్ళో లేరు. కరుణను వాళ్ళ మేనత్త పండక్కని ఎన్నో ఏళ్ళ తర్వాత తీసుకు వెళ్ళింది. బహుశా నాకీ అదృష్టం కలగాలని ఆవిడకా కోరికని దేవుడు కలిగించాడేమో!

ఈ రెండు రోజులు నావి. ఇలాంటి అవకాశం మళ్ళీ నాకీ జన్మంలో రాకపోవచ్చు. అంతా చదివావు. ఈ ఆర్త హృదయం నిన్ను కదిలించగలిగిందా? ఒక్కసారి..... నా జీవితం లోకి తొంగి చూడగలవా. మోడువారిన ఈ బ్రతుకును చిగురింపజేయగలవా?

నీ మనస్సు కరిగితే తలుపులు తట్టనక్కర్లేదు. నా హృదయ కవాటాల్లాగునే అవి కూడా నీకు స్వాగతం చెపుతూ తెరుచుకొని వుంటాయి.

-నీ రాధిక

రాజశేఖర్!

రాత్రి నా గది తలుపులు తెరుచుకుంటే.... అంతవరకు దడదడలాడిన నా గుండెలు ఉప్పొంగాయి. నీ జాలిగుండె కరిగిందని నా మనస్సు పులకించిపోయింది. కొన్నేళ్ళుగా నాలో అణిగిమణిగిన కోరికలొక్కసారిగా కట్టులు త్రెంచుకొని వరదలై పారాయి. సర్వం మర్చిపోయాను. నా సర్వసం నీకర్పించుకోబోయాను.

నా రాజా కంటి చూపు అతి కోమలంగా ఉంటుంది. నోటి మాట మృదుమధురంగా ఉంటుంది. అలాంటి రాజా కౌగిలి ఇంకెంత లలితంగా వుంటుందో అని అంతవరకూ ఊహలు పోయాను. కాని, విరుద్ధమయిన వాస్తవం వెన్ను చరిచింది. ఈ స్పర్శ యింత

కఠినంగా ఎలా వుంది? రాత్రంతా ముందుండగా ఈ తొందర, ఈ ఆవేశం ఎందుకు? ఒక్క మాట లేదు. పలకరించలేదు. అమాంతంగా కౌగలించుకొని నన్ను ఉక్కిరి బిక్కిరి చేయటం.... ఏమిటిదంతా?

అనుమానం వచ్చి నేను లైటు వేసి వుండకపోతే.... నేనీ ఉత్తరం వ్రాయవల్సిన అవసరం ఉండేది కాదు. తెల్లవారాక అందరితోపాటు నువ్వూ రాధిక శవాన్ని చూసుండేవాడివి.

రాజశేఖర్! మగవాడి దృష్టిలో వరించి వచ్చిన ఆడది చులకన - అని నాకు తెలుసు. తెలిసే నిన్ను కోరాను. నువ్వందరిలాంటివాడివి కావనుకున్నాను. మనసున్న వాడివని, ఈ నిర్భాగ్యురాల్ని చీదరించుకొనేటంత కఠిన హృదయం నీకుండదని నీమీద ఆశలు పెంచు కున్నాను. ఇంతవరకూ జీవితంలో నేనే మగవాడినీ ప్రేమించలేదు. కట్టుకున్న వాడు నాకా అవకాశం ఇవ్వనూ లేదు. అనుకోకుండ నువ్వు నా జీవితంలో ప్రవేశించావు. నన్ను అభి మానించే వాడివి దొరికావని ఈ మధ్య నీతో ఏర్పడిన అనుబంధం నాకు చెప్పింది. మనసారా నిన్నే కోరాను. నీ వల్లనే నా కలలు పండాలనుకున్నాను.

నాది దురాశ కావచ్చు. స్వార్థం కావచ్చు. నీ మనస్సు సరిగ్గా తెలియక నేను తొందరపడి వుండవచ్చు. అది నీకిష్టం లేకపోయివుండవచ్చు. నాది కోరరాని కోరికగా నీ మనస్సుకి కష్టం తోచి వుండవచ్చు. అంతమాత్రాన నాకింత శిక్ష విధిస్తావా? సూరిబాబు అన్నమాటనే నీచమయిందని అన్నవాడివి - ఆ సూరిబాబునే నా గదికి పంపించాలని నీకెలా అనిపించింది? నేనంత నీతిమాలినదానిలా కనిపించానా నీకు? నిన్నటిదాకా దేవతలా కనిపించిన నీ కళ్ళకి ఈవేళ కామపిశాచిలా, ఒట్టి బజారుమనిషిలా కనిపించానా రాజశేఖర్! అయ్యో. ఇంతకన్నా నువ్వే క్రిందకి దిగివచ్చి 'నీకింత కండకావరం ఏమిటి?' అని నా లెంపలు వాయించినా నేనింత బాధపడేదాన్ని కాదే!

ఎందుకింత ఘోరం చేశావు? నా స్వప్నమందిరం ఎందుకిలా చిన్నాభిన్నం అయిపోయింది? ఇంత జరిగాక ఈ వూపిరి ఆగిపోకుండా ఎలా వుంది?

రాత్రంతా ఏడ్చాను. ఎంత ఏడ్చినా నా ప్రశ్నలకి జవాబులు దొరకలేదు. నేనారాధించిన మనిషి దృష్టిలో నా బ్రతుకు ఎందుకింతగా నేలమట్టమయిందో తెల్సుకుందామని నీ గదికి వచ్చాను. నువ్వింకా నిద్రపోతూనే వున్నావు. లేపినా లేవలేదు. నిద్రమాత్ర వేసుకున్నావని తెలుస్తూనే వుంది.

ఇంత జరిగాక ఇంకా ఏ ముఖం పెట్టుకొని నేను నీ దగ్గరికి రావాలి? నీకెలా ముఖం చూపించాలి. ఇంత సిగ్గుమాలిన బ్రతుకయిపోయిందేమిటి నాది? నీవే కాదు - ఈ లోకంలో ఎవరికీ కనిపించనంత దూరం వెళ్ళిపోవాలని వుంది నాకు. ఆ పసిపిల్ల - కరుణతోటి బంధం.... ఆ పిల్ల బాధ్యత వెనక్కి పట్టుకొని లాగుతున్నాయి. లేకపోతే ఈ జీవితానికీపూటతోటే ముగింపు చెప్పేదాన్ని.

దేనికీ నోచుకోని నిర్భాగ్యురాల్ని. ఈ నాల్గుగోడల మధ్య నిశ్శబ్దంగా కాలచక్రం క్రింద

నలిగిపోవల్సిన దాన్ని. నేనెక్కడికీ వెళ్ళలేను. నువ్వే వెళ్ళిపోవాలి. నామీద నీకెలాంటి భావం వుండనీ - కరుణమీద ఏమాత్రమయినా జాలి వుంటే వెంటనే గది ఖాళీ చేసి ఎక్కడికయినా వెళ్ళిపో! నా పాపిష్టి ముఖాన్ని మళ్ళీ ఈ జన్మలో చూడలేనంత దూరం వెళ్ళిపో! నీ యెదుట పడే అవకాశాన్ని నాకీ జన్మలో మళ్ళీ రానీకు. నాకోసం కాదు - కరుణకోసం ఇంతగా అర్థిస్తున్నా.

అభాగిని.

-రాధిక

రాజా!

ఆవేళ సాయంత్రం నా గదికి వచ్చి తలుపు తట్టావు. ఏదో చెప్పాలన్నావు. ఒక్కసారి తలుపు తీయమన్నావు. కాని, నేను తీయలేదు. నీ మాట వినిపించుకోలేదు. అప్పటికే నా మనస్సు పూర్తిగా విరిగిపోయింది. రోజంతా పచ్చి మంచినీళ్ళు కూడా త్రాగలేదు. నీరసం, నిస్సత్తువ, నిస్పృహ నన్ను పూర్తిగా క్రుంగదీసాయి. మతిలేని దానిలా ప్రవర్తించాను. 'నువ్వు కనుక లోపలికి వస్తే నన్ను నేను పొడుచుకు చచ్చిపోతా'నని అరిచాను. ఒట్టు పెట్టి హడలకొట్టి నిన్ను ఇంట్లోంచి వెళ్ళగొట్టాను.

కాని, నేను కొంచెం నిదానించి వుంటే.... నిన్ను లోపలికి రానిచ్చివుంటే నీ మాటలు నాలుగు వినివుంటే ఈ నాల్గేళ్ళూ నేనీ బాధ పడవల్సిన అవసరం లేకపోయేది. దురదృష్ట వంతురాల్ని. ప్రేమించిన మనిషిని చేజేతులా దూరం చేసుకున్నాను.

మళ్ళీ సూరిబాబు నా దగ్గరికి వచ్చి వుండకపోతే ఈ నిజం నాకెప్పటికీ తెల్సి వచ్చేది కాదు. ఎంత హఠాత్తుగా వెళ్ళిపోయాడో అంత హఠాత్తుగా ఓ రోజున మా యింటికి వచ్చాడు. అతన్ని చూడగానే గుర్తు పట్టలేనంతగా చిక్కి శల్యమైపోయి వున్నాడు. ఎవరు మీరని అడిగితే 'మళ్ళీ కనిపిస్తే పొడిచి చంపేస్తారని కత్తి చూపించారే - ఆ దౌర్భాగ్యుడ్ని నేనేనండీ! ఇప్పుడీ రోగంతో తీసుకు చచ్చేకన్న ఆ వేళ మీ కత్తిపోటుకి చచ్చిపోయుంటే బావుండిపోయేది' అన్నాడు.

గుర్తుపట్టాను. 'సూరిబాబూ! నువ్వా!' అన్నాను. 'అవునండీ! ఆ రాత్రి మీ మీద అత్యాచారం చేసిన పాపానికి ప్రతిఫలం అనుభవిస్తున్న సూరిబాబును నేనే!' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాను.

అతన్నా స్థితిలో చూసేసరికి నా మనస్సు కరిగిపోయింది.

అతనికి లంగ్ కేన్సరట! ఆపరేషన్ చేసి ఒకటి తీసేసారట. 'అయ్యో! ఇంత చిన్న వయస్సులో నీకెంత కష్టం వచ్చింది!' అని బాధపడ్డాను.

'మీరు నాకోసం ఇంత ఆవేదన పడుతున్నారే! అలాంటిది మీకెంత ఘోరం తలపెట్టాను! ఆ నీచబుద్ధి నాకెందుకు పుట్టింది?....' అంటూ తనను తాను నిందించుకోవటం మొదలు పెట్టాడు. 'తప్పంతా నీది కాదు. దాంట్లో నీ స్నేహితుడికీ కొంత పాలుంది' అన్నాను.

'లేదండీ! ఇందులో రాజాదేమీ తప్పులేదు. మీరతన్ని అపార్థం చేసుకున్నారు. దానికి కారణం నేనే! ఇంతకాలంగా ఆ నిజాన్ని ఒప్పుకోలేకపోయిన పిరికివాడ్ని. ఇకనయినా నిజం చెప్పి నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోనివ్వండి!' అంటూ జరిగిందంతా చెప్పుకు వచ్చాడు సూరిబాబు.

భర్త నిరాదరణకి లోనయిన ఆడదంటే లోకంలో చాలామందికి చులకనే! సూరిబాబు కూడ అలాంటివాడే! 'నీ మీద ఆమెకెంతో ప్రేమవుంది' అని నిన్ను ప్రోత్సహించాడంటే.... అతని ఉద్దేశ్యం నిత్యం యింట్లో ఉండే నువ్వు నన్నెలాగో వలలో వేసుకోవాలని.... ఆ తర్వాత సమయం చూసి తనూ అవకాశం చేజిక్కించుకోవచ్చుని!

కాని, నువ్వు నన్నెప్పుడూ ఆ ఉద్దేశంతో చూడలేదు.

నీకు మేనరికం వుందని.... కొంచెం ఉద్యోగంలో స్థిరపడ్డాక మీ మరదల్ని పెళ్ళాడాలను కుంటున్నావని నాకు తెలియనే తెలియదు. తెల్సుంటే నేను నీమీద ఆశలు పెంచుకొని వుండేదాన్ని కాదు. నేనా వుత్తరం వ్రాసి వుండే దాన్నీ కాదు. నాలోని కోరికల్ని నాలోనే చంపుకొని వుండేదాన్ని.

'ఆమె పడుతున్న బాధ చూస్తూ వూర్కోలేను. శాంతికి అన్యాయం చేయలేను. ఎవర్నీ నొప్పించకుండా ఈ సమస్యని పరిష్కరించటం ఎలా?'

ఆ సమయంలోనే సూరిబాబు నీ గదికి వచ్చాడు. అతని మాటతీరు నచ్చకపోయినా తరచి తరచి అడిగితే ఏదయినా ఉపాయం చెప్పకపోతాడా అన్న భ్రమతో అతనికా సంగతి చెప్పావు.

"నీకింకా శాంతితో పెళ్ళికాలేదు. శాంతికి అన్యాయం చేసినట్టెలా అవుతుంది? శాంతి సంగతి ఈమెకు చెప్పకు. ఇవేళ జరిగింది శాంతికి చెప్పకు" అంటూ సూరిబాబు నిన్ను ప్రోత్సహించాడు. కాని, నీది స్వచ్ఛమయిన మనస్సు.

నాతో నిజం చెప్పి నేనేమని నిర్ణయిస్తే దానికి కట్టుబడి వుంటానన్నావుట!..... అవసరం వస్తే అంతదాకా వస్తే ఈ నిర్భాగ్యపు రాధికకోసం శాంతినే వదలుకుంటానన్నావుట!

తలనొప్పిగా వుందంటే మాత్ర ఇచ్చాను. అది నిద్రమాత్ర అని వాడికి తెలియదు. రాజా నిద్ర పోతుండగా మీరు రాసిన ఉత్తరాన్ని దొంగతనంగా చదివాను. అది చదివి మీ గురించి నేనెంత నీచంగా ఆలోచించానంటే.... ఒకవేళ తలుపు తీసుకొని వచ్చింది నేనేనని మీకు తెల్సినా మీరభ్యంతరం చెప్పరనుకున్నాను. నాకు లొంగిపోయే వారనుకున్నాను. దేవతలాంటి మిమ్మల్ని అంత తక్కువగా అంచనా వేసి అత్యాచారానికి పాల్పడ్డ పాపానికి ఫలితం ఇలా అనుభవిస్తున్నాను' అంటూ సూరిబాబు బాధపడ్డాడు.

'జరిగిందంతా ఒక పీడకలగా మర్చిపో సూరిబాబూ! పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మరోటి లేదు. ఇప్పుడు నువ్వు ఆరోగ్యమయిన ఆలోచనలు పెంచుకుంటున్నావు. నీ ఆరోగ్యం తప్పకుండ కుదుట పడుతుంది. నువ్వు కలకాలం క్షేమంగా వుండాలని ఆ దేవుడ్ని

ప్రార్థిస్తాను....' అని అతడికి వీడ్కోలు చెప్పాను.

వెళ్ళిపోయే ముందు శాంతితో నీకు పెళ్ళయిందని అతనే చెప్పాడు. నాకా వార్త విన్నాక పరమానందమయింది. మీ పెళ్ళికి తనకి ముఖం చెల్లక వెళ్ళలేకపోయానన్నాడు. అయినా, తనకి ఆపరేషన్ అయిందని తెల్సి నువ్వే వచ్చి చూసావని చెప్పాడు. నాకెంతో సంతోష మయింది.

ఒక్కసారి నిన్ను కల్సుకొని నీతో మనస్సు విప్పి మాట్లాడుకోవాలనిపించింది. నా పొరపాటుకి నిన్ను క్షమాపణ వేడుకోవాలనిపించింది.

కాని, అస్వతంత్రురాల్ని. ఎక్కడున్నావని వెతుక్కుంటూ రాగలను? రావద్దని ఒట్టు పెట్టాను. ఇంక నువ్వెలా వస్తావు? ఈ చిక్కు ఎలా విడుతుంది? మళ్ళీ నిన్ను కల్సుకోకుండానే ఈ జీవితం గడిచిపోతుందా!.....ఏడాదిగా వేధిస్తున్న నా ప్రశ్నలకి ఇవేల్టిదాకా జవాబులు దొరకలేదు నాకు!

ఈలోగా కరుణకి పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళి శుభలేఖ వేస్తే తప్పక వస్తావని ఆ విధంగానయినా నిన్ను కల్సుకొనే అదృష్టం కలుగుతుందని ఆశపడ్డాను. నా దురదృష్టం.... సూరిబాబుని నీ అడ్రస్సు అడగటం మర్చిపోయాను. నువ్వెక్కడున్నదీ తెలియలేదు. నీ పాత అడ్రసుకి శుభలేఖ వేస్తే అది వెనక్కి తిరిగి వచ్చింది.

కరుణకి పెళ్లయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఇంతకాలం కరుణ కోసం బ్రతికాను. ఇంక నేనెవరికోసం బ్రతకాలి? కేవలం నీ స్మృతులు నన్ను బ్రతకమన్నాయి. ఏదో నాటికి నిన్ను చూడగలుగుతానన్న ఆశ.... నాకీ ఒంటరితనంలో తోడుగా నిలిచింది.

ఇంతకాలంగా ఎదురుచూసిన శుభఘడియ వచ్చింది. కాకతాళీయంగా శాంతీ, కరుణా ఒకే ఆసుపత్రిలో పురుళ్ళు పోసుకోటానికి రావటం జరిగింది. మళ్ళీ నిన్ను చూడగలిగే భాగ్యం నాకు దక్కింది!

ఆ చక్కని కళ్లు, ఆ నొక్కుల జుట్టు..... నిన్నిట్టే గుర్తుపట్టి అట్టే నిల్చిపోయాను. నీ గొంతు వినేసరికి ఆనందపరవశంతో నా వొళ్ళు పులకరించిపోయింది. నువ్వు లేవబోతుంటే 'వదిన వచ్చేస్తుంది. కాసేపు కూర్చోండి' అంది కరుణ. నీ ముఖం చూసి నీ మనోభావాల్ని చదవగలిగాను. నీకుండాలని వుంది. నన్ను చూసి నాతో మాట్లాడాలని వుంది. కాని, నేను పెట్టిన ఒట్టు ఝుళిపిస్తోంది. మళ్ళీ వస్తానని చెప్పి గబగబా అక్కడ్నించి వెళ్ళిపోయావు.

వెళ్ళిపోకుండా నిన్ను ఆపుదామని ఒకడుగు ముందుకు వేసాను. నా పక్కనుంచే వెళ్ళిపోయావు. నాకు తెలుసు, నన్ను నువ్వు గుర్తు పట్టలేకపోయావని.... ఈ నాల్గేళ్లల్లో నువ్వు గుర్తుపట్టలేనంతగా నా ఆకృతి మారిపోయింది.

నువ్వు వచ్చి వెళ్ళావని....శాంతికి బాబు పుట్టాడని కరుణ చెప్పింది. ఆనందాన్ని ఉగ్గపట్టుకోలేక నీ బాబుని చూద్దామని శాంతి గదిని వెతుక్కుంటూ వచ్చాను. నువ్వక్కడ లేవు. ఎంతో వెలితి అనిపించింది.

నన్ను నేను మీ అత్తయ్యగారికి పరిచయం చేసుకున్నాను. ఆవిడ చంటిబాబుని నా చేతుల కందించారు. అప్పుడు నా భావాలెలా ఉన్నాయో ఎలా వర్ణించగలను? నా కన్నబిడ్డనే నేనెత్తుకున్నంత పరవశం నాకు కలిగింది. నీ బిడ్డని ఒక్కసారి ఎత్తుకోగలిగాను. కళ్ళారా చూసుకోగలిగాను. ఈ జీవితానికీ తృప్తి చాలు!

నీ ప్రేమ పొందిన అదృష్టవంతురాల్ని పలకరిద్దామని శాంతికి దగ్గరగా వెళ్ళాను. నేనాశించిన సంతోషం ఆమె ముఖంలో నాకు కనిపించలేదు. ఆమె కనురెప్పల నీడల్లో తొంగి చూస్తున్న విషాదాన్ని గుర్తించాను. మీ అత్తగారు లేకుండా చూసి, 'రాజా నాకు బాగా తెల్సు. రాజా ఆత్మీయులు నాకు ఆత్మీయులు. నా దగ్గర దాచకుండా నీ మనస్సులోని బాధేమిటో నాకు చెప్పమ్మా!' అని శాంతిని బుజ్జగించి అడిగాను.

'బావకి నా మీద ప్రేమ లేదు' అంటూ ఆ పిచ్చిపిల్ల బావురుమంది. ఆ మాట వినేసరికి నా మనస్సు చివుక్కుమంది. 'ఎందుకిలా అనుకుంటున్నావమ్మా!' అని గుచ్చి గుచ్చి అడిగితే చెప్పింది. తన మనస్సులోని వ్యధనంతా చెప్పుకుంది...... ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటాడు. తనంతట తను మాట్లాడడు. వంద ప్రశ్నలు వేస్తే ఒక్క మాట జవాబు చెపుతాడు. నాదేమయినా తప్పుంటే చెప్పు - సవరించుకుంటాను బావా - అంటాను. నాదేమీ తప్పు లేదంటాడు. మరి ఆ మౌనం ఏమిటో నాకు భయంకరంగా వుంటుంది. బాబు పుట్టాడంటే ఏ తండ్రి మనస్సు ఉప్పొంగిపోదు! ఒక్కసారి చేతుల్లోకి తీసుకోవటమే మహాభాగ్యమయిపోయింది.... ఇదంతా చూస్తూ బావ మనస్సులో నాకు స్థానం వుందని ఇంకెలా అనుకోను? తాను నాతో చెప్పలేక బాధపడుతున్నాడు. బావ మనస్సు నాది కాదు. అక్కడ మరెవరికో స్థానం వుంది' అంది శాంతి.

ఏమిటిది రాజా! పెళ్ళికి ముందు శాంతికి అన్యాయం చేయకూడదని బాధపడిన నువ్వు ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? ఆడది శారీరకమయిన హింసనయినా భరించగలదు కాని మానసికమయిన కోతను భరించలేదని నీకు తెలియదా? పరాయి స్త్రీ కష్టంలో వుంటేనే చూడలేకపోయిన నువ్వు భార్య మానసిక వ్యధని గుర్తించలేవా?

నీ అపోహలు తొలగిపోవాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. నీ మీద ఇప్పుడు నాకెలాంటి కోపమూ లేదు. జరిగిందానికి..... నిన్ను నొప్పించిన దానికి నువ్వే నన్ను క్షమించాలి.

ఇకనయినా మనస్సు కుదుట పరచుకో! శాంతిని ఆదరించు. శాంతికి కష్టం కలిగితే ఈ రాధిక మనస్సుకి శాంతి దొరకదు. రాజా! మీరిద్దరూ అన్యోన్యంగా కలకాలం జీవించాలి. ఈ జీవితంలో నీనుంచి నేను కోరేది మరేదీ లేదు. రాజా మనస్సులో ఒక మారుమూల నాకూ కాస్తంత చోటుందన్న తృప్తితో చివరి క్షణం వరకూ ఈ జీవితాన్ని కొనసాగించగలను.

శలవ్!

- రాధిక.

•